# పీనుగ



**కథ**

## బెజ్జారపు రవీందర్

**అల్ప పీడన ద్రోణి ప్రభావం... ఆకాశం మబ్బు పట్టి ఉంది. ఉండి ఉండి సన్నటి తుంపర, అందులోనూ జనవరి నెల చలి! సమ్మయ్య ముఖం కళ తప్పి ఉంది. బొగ్గుల మీద గిన్నె...చాయ మసిలి మసిలి కమ్మటి వాసన వస్తోంది. సెగ వేడిగా తగిలి చలిని కొద్దిగా తరిమికొడుతున్నది. ఓదెలు, పోచయ్య వచ్చిన్రు. అలవాటు కొద్దీ సమ్మయ్య స్టీలు గ్లాసుల్లో చాయ వాళ్లకిచ్చిండు. గ్లాసుల్ని గుప్పిట్ల బిగిస్తూ వాళ్లిద్దరు ఆ వెచ్చదనాన్ని అనుభవిస్తున్నారు. తానూ ఓ గ్లాసుల చాయ పోసుకుని మెల్లగ తాగడం మొదలు వెట్టిండు సమ్మయ్య.**

"సమ్మన్నా! మీ అవ్వా, మీ పొల్ల ఇంకా రానట్టున్నారు?" అడిగిండు ఓదెలు.

"నిన్న రాత్రి మా పెద్దోనికి జరమచ్చింది. గందుకే ఆగినట్లున్నరు" అన్నాడు సమ్మయ్య.

"దీని యవ్వ...గీ సలిల ఉడుకుడుకు కంకులు దింటె మంచిగుండు" అన్నాడు పోచయ్య చేతుల్ని గదువ కింద పెట్టుకుంటూ.

ఇంటర్మీడియట్‌తో చదువు బందుజేసిన ముప్పయి రెండేండ్ల సమ్మయ్య వాళ్ల ఊరికి సమీపంలో ఉన్న క్రషర్ల దగ్గర చాయ హోటల్ నడుపుతుంటడు. అతని భార్య హోటల్ పనిలో సాయం చేస్తుంటది. తల్లి గంగు హోటల్ ముందట మక్కంకులు కాల్చి అమ్ముతుంటది. హోటల్‌లో టీ, టిఫిన్లు, పండ్లు దొరుకుతాయి.

సమ్మయ్య ఇంకా అట్లనే ఫికర్ తోటి ఉండడం జూసి "ఏంది సమ్మన్నా! పిల్లి వట్టిన కోడి లెక్క ఉన్నవ్. పిలగాని గురించేనా? అయినా సూది మందులల్ల నీకు తెల్వని మందులేమున్నయి? నువ్వే మందియ్యకపోయినవ్ అంటూ సలహా ఇచ్చిండు ఓదెలు.

పొద్దుగాల్ల లేచినప్పటి నుంచి సమ్మయ్య మనసు ఎందుకో గుబులు గుబులుగా ఉంది. వచ్చేటప్పుడు సైకిలు పయ్యకింద వడి ఉడుత పిల్ల చచ్చింది. 'అర్రెర్రె' అనుకుంట పయ్యను తప్పిద్దామని జూసినా అది సీదా పయ్యకిందికే వచ్చింది. "సచ్చిపోదామనే పయ్యకింద పడ్డట్టుంది" అనుకున్నాడు. సమ్మయ్య. వారం రోజుల కిందట రాఘవాపురం రైల్వేస్టేషన్ దగ్గరి రైలు పట్టాల మీద తునాతునకలైన పోరని పీనుగు యాదికచ్చింది సమ్మయ్యకు. "ఆపీనుగు మీదున్న గీతల అంగి అచ్చం తన కొడుకు తొడిగె అంగిలాంటిదే!" ఆ శవం, ఆ అంగీ యాదికచ్చినప్పుడల్లా కడుపు అవిశిపోతున్నది సమ్మయ్యకు. చచ్చిపోయిన ఉడతపిల్ల, ఆ పిలగాడు... రెండూ అతని మనసులో కలిసిపోయి కలగాపులగం అయినయి.

క్రషర్ల దగ్గరున్న తన హోటలుకు వచ్చి, ఊడ్చి, నీళ్లు జల్లి, పొయ్యి ముట్టిచ్చి, పాలు వెట్టి...ఎన్ని పన్లు జేస్తున్నా ఉడుతపిల్ల, రైలు పట్టాల మీది పిలగాని శవం రెండూ మనసుల కేలి పోతలేవు. చిన్నప్పటినుండి తన దోస్తులు, అంతో ఇంతో కష్టసుఖాలు పంచుకునే ఓదెలు, పోచయ్య వచ్చినా సమ్మయ్య మనసు స్థిమితపడుతలేదు.

సుమారు అరవై సంవత్సరాలుండే ఎల్లికి మతి స్థిమితం లేదు. కానీ రోజూ పొద్దుగాల్ల సత్తయ్య హోటల్ కాడికచ్చి తన గ్లాసు చూపుతది. బోణీ అయ్యేకంటె ముందు ఆమె వచ్చి చాయ తాగిపోతే ఆ దినం మస్తు గిరాకీ ఉంటదని సమ్మయ్య తల్లి గంగు నమ్మకం. సమ్మయ్యకేమో జాలి. ఆమె ఇంకా ఎందుకు రాలేదో తెలియక మనసులోనే గులిగిండు.

కొద్ది దూరంలో క్రషర్ల నుండి వస్తున్న రాతి దుమ్మను చూస్తూ స్టూలు మీద కూర్చున్నాడు సమ్మయ్య. దుమ్ము...దాన్నుండి మసగ్గా కనిపిస్తున్న గుట్టను చూడగానే అతని కడుపు దేవినట్లయింది. డైనమేట్ దెబ్బలతో, డ్రిల్లింగులతో మొత్తం ఆకారం కోల్పోయి ఉంది గుట్ట. మట్టి అంతా తొలగిపోయి క్యాన్సర్ రోగి తలలా కనిపిస్తున్నది.

"సిదలు సిదలైన మనిషి శవంలాగా ఉంది గుట్ట. తోడేళ్ళు మందబారిన పడిన దుడ్డెలాగుంది గుట్ట" సమ్మయ్య ఆలోచనలు రకరకాలుగా సాగుతున్నాయి.

సమ్మయ్య చూపులు నిలిపిన దిక్కు చూసిన ఓదెలు "కూసుండి తింటె గుట్టలైన కరుగుతాయని మా తాత అంటుండే. గానీ సమ్మిగా! కూసుండి తినేంత సంపాయించకున్నా, మన గుట్టకరిగిపోతున్నదేందిరా?"అన్నాడు.

సమ్మయ్య మాట్లాడలేదు. పోచయ్యకు మాత్రం ఆవేశం ఆగలేదు.

"గుట్ట కరిగిపోతేందిరా...భూమిలకు గూడా పొక్కలు గొడుతున్నరు గదరా. ఇప్పటికే పాతాళంలకు గొట్టిన్రు. ఎంత మంచి గ్రానైటు బండరా? ఆ గుట్టకింది జాగను మన పెద్దపల్లి డాక్టరు లీజుకు తీసుకున్నడు గదా. ఇన్ని రోజులు మనుషుల్ని కోసి సంపాయించిండు. ఇప్పుడు నేలతల్లి కడుపు పలుగ్గొట్టి కమాయిస్తడు" కసిగా అన్నాడు పోచయ్య.

"ఎవలో కమాయిస్తే మనకేందిలే! మనకు పని దొరుకుతున్నది. ఆనికి పైసలత్తున్నయి. ఊర్లె గూడా సిమెంటు రోడ్లయినయి" అన్నాడు ఓదెలు నిర్లిప్తంగా.

"ఈ గుట్టలు మన ఊరోళ్ళందరి ఆస్తిరా. అవి పిండి పిండై కొందరి జేబులల్లనే పైసలుగా మారుతున్నాయిరా. మిగతా అందరి నోట్లె మన్నె. దీని మర్మం తెలిస్తే అంతా తెలిసినట్లే" అన్నాడు సమ్మయ్య ఏదో పొడుపు కథ పొడుస్తున్న గొంతుతో.

పల్చటి ఎండ హోటల్ ముందు పరుచుకున్నది అదీ కొద్దిసేపే. అంతలోనే మళ్లీ మబ్బులో, మంచు తెరలో... ఎండ మాయం.

ఓదెలు తన రెండు అరచేతుల్ని బొగ్గుల పొయ్యి మీద వెచ్చదనం కోసం పెడుతూ–

"నిజమేరా సమ్మిగా! గుట్ట అందరికి తల్లి లెక్క ఉంటుండే. దీన్ని ముక్కలు ముక్కలు గొట్టితే ఎవనికెంత వస్తుందో లెక్కలెయ్. అటూ ఇటూ అనకుండా మనకు కొంత జరుగుబాటు అయితుందనుకో. కానీ పది, పదిహేనేండ్లల్ల మన సర్పంచ్‌లు ఎంత బలిసిపోయింగ్రు... కాంట్రాక్టర్లెంత ఎదిగిపోయిన్రు...కుక్కలకు గదా బొక్కలేసినట్లు ఊర్లె రొండు సిమెంటు రోడ్లేసిన్రు...రోడ్లు..." అన్నాడు ఓదెలు.

"గిన్ని లెక్కలు సరేగానీ, మనం చిన్నప్పటి నుంచి ఆడిపాడిన గుట్ట... గిట్ల మన ముందటనే మాయమైపోతుంటే ఎట్లనో అనిపిస్తలేదారా... ఎక్కడ జూసినా చావులే కనిపిస్తున్నయిరా... చివరాఖరికి గుట్ట కూడా..." సమ్మయ్య గొంతులో చలీ, బాధా కలిసిన వణుకు.

ఓదెలు, పోచయ్య ఏం మాట్లాడలేదు. ముగ్గురి కండ్లు కలుసుకున్నాయి. పోచయ్య తేరుకున్నాడు.

"నా కొడకా...ఆ గుట్టలల్ల ఏం పాతర పెట్టినవో పట్టుకపోరా" అంటూ లేచిండు.

అతనితో పాటు ఓదెలు లేచి వెళ్లడానికి సిద్ధమయ్యాడు. భుజం మీది సన్నటి తువ్వాలను చెవుల చుట్టూ కట్టుకున్నాడు. జేబులోంచి బీడీల కట్ట తీసి పోచయ్య కొకటి ఇచ్చిండు. ఇద్దరూ పొయ్యిమీద బీడీలు అంటించుకొని ఆ గుడిసె హోటల్ నుండి బయటికి నడిచిన్రు.

పోచయ్య తన చేతిని గుట్టవైపు చూపిస్తూ "ఇండ్లు కూలిపోతే మల్ల గట్టచ్చు. చెట్లు పడి

పోతే మల్ల నాటుకోవచ్చు. కానీ గుట్ట...మన సిన్నప్పటి గుట్టను మల్ల తెప్పియ్యస్త దారా... అదీ సమ్మిగాని బాధ...పాపం... కానీ గీ ఏడు పులు మనకెందుకురా?మన బతుకులు మనం బతుకుటానికే అరగోస కావట్టె. ఇంకేమన్నా సోంఛాయిస్తదా" అన్నాడు పోచయ్య జాలితో.

ఓదెలు, పోచయ్య చాయ దాగి హోటల్ నుండి వెళ్ళిపోయారు. అయినా వాళ్ళ పేర్లు రాసిన సిగరెట్ అట్టముక్కల్ని తీసి వాళ్ళ ఖాతా రాయాలనే విషయం గూడా మరిచి పోయి గుట్ట దిక్కే చూస్తూ కూర్చున్నాడు సమ్మయ్య. క్రషర్ల నుండి రాతి దుమ్ము క్షణక్షణానికి పెరుగుతున్నది. ఆ దుమ్ము. ధూళి తమ ఊరి పంట పొలాల్ని. చెరువుల్ని కమ్మేసి వ్యవసాయాన్ని దెబ్బతీస్తున్న విషాదం అతని మనసులో మెదులుతున్నది.

** ** **

ఛిద్రమవుతున్న ఆ గుట్టలను చూస్తున్నకొద్దీ సమ్మయ్య మనసు చిన్నప్పటి జ్ఞాపకాలతో బరువెక్కింది. అతని ఊహల్లో ఆ గుట్టలు మళ్ళీ చిగురించాయి. ఆ గుట్టలను ఆపాదమస్తకం కొలిచిన తను, తన నేస్తాల సంచారాలు గుర్తుకు వచ్చాయి.

బడి సెలవు రోజుల్లో... సెలవులు లేనప్పుడు బడి ఎగ్గొట్టి చెరువుల్లో చేపలు పట్టేవారు. లేకపోతే గుట్టపైనే సంచారం. పరికి పండ్లు, సీతాఫలాలు,రేగ్గాయలు, తునికి పండ్లు తెంపుకుంటానికి పోటీలు పడేవాళ్ళు. "ఎన్ని పూల తోటి కళకళలాడుతుండె గుట్ట. తంగెడు, గునుగు, టేకు, గోగుపూలు, శంఖుపూలు, కట్లపూలు, పుట్నాల పూలు, జిల్లేడు పూలు, ఇప్పపూలు... హోళీ వచ్చిందంటే చాలు గోగుపూలు తెంపుకచ్చి దంచి రంగు తయారుచేసి ఆడుకునేవాళ్ళం. ఎండాకాలంల అసలు గుట్టనే హోళీ ఆడుతున్నట్లుండేది!' సమ్మయ్య మనసులో గుట్టమీది చెట్ల పచ్చదనం, పూల పరిమళమూ మెదిలాయి.

ఒక్కోసారి గుట్టకు సమ్మయ్యను తల్లే పంపేది. కట్టెపుల్లల కోసమన్నా, పుట్టమన్ను, కుంకుడుకాయల కోసమన్నా... కుతికలైతే జిల్లేడు పాలకోసమన్నా.

గుట్టమీద ఒక చీకటి గుయ్యారం ఉండేది. కొంత లోపలికి వెళితే మాత్రం పైనున్న బండల సందుల్లోంచి వెలుతురు లోపల పడేది. అక్కడెవరో ముని తపస్సు చేసుకునేవాడని, ఒకసారి ఒక బ్రహ్మరాక్షసి వచ్చి తినేయబోతే ముని తన తపశ్శక్తితో దాన్ని గుట్టల అడుక్కు తొక్కిండని పెద్దవాళ్ళు కథలు చెప్పేవాళ్ళు. పొద్దంతా గుట్టమీద తిరిగేటప్పుడు సమ్మయ్యకు ఏమనిపించేది కాదు కానీ రాత్రిపూట వాళ్ల దగ్గర ఏదో మెసిలినట్లయి భయపడేవాడు.

ఆ గుహ గోడల మీద చిన్న పిల్లలు గీసిన బొమ్మల్లాంటి గీతలుండేవి. వాటి గురించి బళ్ళోకి కొత్తగా వచ్చిన సారుతో చెపితే అవి బహుశా ఆదిమ మానవుడి గీతలు కావచ్చని అన్నాడు. ఆ సంగతి విన్నాక సమ్మయ్యకు చరిత్ర పట్ల ఎడతెగని ఆసక్తి మొదలయింది. "తన ముత్తాత ముత్తాతలనాడు మనుషులు బరివాతల బండలు పట్టుకొని తిరిగిన జాగలల్ల తాను కూడా తిరుగుతున్నానని" సమ్మయ్య మురిసిపోయేవాడు.


తరువాత చాలా సంవత్సరాలకు...ఈ క్రషర్ల ప్రారంభం అయ్యేకన్న ముందు పరిశోధకులు గుట్టలమీద రాతిపనిముట్లను, ఇంకా ఏవో ఆధారాలను సేకరించారు. గుహ గోడలమీది బొమ్మల గురించి పత్రికల్లో వార్తలు వచ్చాయి. క్రషర్లు మొదలయ్యాక కాంట్రాక్టర్లు ఆ గుహను ఖాతరు చెయ్యలేదు. ధ్వంసం చేసారు. అప్పుడు కొంత గడబిడ జరిగింది గానీ, కాంట్రాక్టర్లు ఎక్కడికక్కడ నొక్కేశారు.

హోళీ వచ్చిందంటే చాలు గోగుపూలు తెంపుకచ్చి దంచి రంగు తయారుచేసి ఆడుకునేవాళ్ళం. ఎండాకాలంల అసలు గుట్టనే హోళీ ఆడుతున్నట్లుండేది!' సమ్మయ్య మనసులో గుట్టమీది చెట్ల పచ్చదనం, పూల పరిమళమూ మెదిలాయి.

"చిన్నప్పటి దోస్తులందరు చిందర వందర అయ్యిన్రు. ఓదెలు, పోశన్న మాత్రం రోజుకొక్కసారన్న కలుస్తరు" సమ్మయ్య జ్ఞాపకాల్లో మిత్ర బృందం కదలింది.

కొంతమంది తమ మేకల్ని, బర్లను రోజూ అడివికి కొట్టుకచ్చేవాళ్ళు. ఆ అడవి, గుట్ట... అంతా మేపుకుంటూ తిరిగేవాళ్ళు. మేకల సంగతి యాదికి వచ్చేసరికి సమ్మయ్య ముఖంలో సంతోషం లాంటి భావమేదో కదిలింది.

మేకలతోపాటు జలజ గుర్తొచ్చింది సమ్మయ్యకు. అంతా 'జల' అని పిలిస్తే సమ్మయ్య మాత్రం 'జెల్ల' అని పిలిచేవాడు. రెండు జడలతో, రెండు మేకలతో ఉన్నంతలో శుభ్రంగా తయారై వచ్చేది జలజ. సమ్మయ్య ఆమెను జెల్ల అని పిలిచినప్పుడల్లా గయ్‌మని లేచేది.



"నేను జిమ్మును గాదు. మనిషిని. నేను జెల్లనైతే నువ్వు బుడ్డ వరుకవు. నిండా ముండ్లే..." అంటూ ముఖం అదోలా పెట్టేది.

ఆమె ఎంత తిడితే అంత నవ్వుతూ ఉండేవాడు సమ్మయ్య. ఇంకా రెచ్చిపోయేది. ఇద్దరి మధ్య కొట్లాటలకు చరమగీతం పాడిందొక సంఘటన. మేకల్ని మేపుకుని ఒక సాయంకాలం ఇంటికి తిరిగి వెళుతున్నప్పుడు వాళ్లిద్దరికి కొద్ది దూరంలో కనపడిన దృశ్యం... ఒక మగ. ఆడ... ఒకర్నొకరు అలుముకుంటున్న ఆ దృశ్యం చూసి, కొంత ఆసక్తి, సిగ్గు...ఇద్దరూ ఒకర్నొకరు చూసుకున్నారు. వాళ్ళిద్దరి మధ్య ఒక నిశ్శబ్ద సంభాషణేదో జరిగినట్లయింది.

అప్పటి నుండి సమ్మయ్య, జలజలిద్దరు... తమ మధ్య అందరికేకాదు తమ ఇద్దరికీ అర్థంకాని ఒడంబడిక ఏదోజరిగినట్లు దూరం, దూరంగా మసలుకునేవాళ్లు. చెట్లమీద పండిన సితవలుక పండ్లనిస్తే మాట్లాడకుండా తీసుకునేది.

జలజకు, తనకు మధ్యన ఉన్న బలమైన సరిహద్దు రేఖల గురించి మొదటిసారి గాఢంగా తెలియవచ్చిన రోజును సమ్మయ్య గుర్తుకు తెచ్చుకున్నాడు. "ఇది జరిగి సుమారు ఇరవై ఏండ్లపైనే అవుతున్నది. కాని తన తరువాతి జీవితానికి, ఆన ఆవేశాలకు ఆ సంఘటనే కారణం కదా! సమ్మయ్య కండ్లముందు నాటి సంఘటన సజీవంగా కదలాడింది.

కొత్త బట్టలేసుకుని వచ్చిన జలజతో పరాచికాలాడింది మల్లమ్మ. అంతకుముందు చూసిన సిన్మాలోని మాటల్ని గుర్తుకు తెచ్చుకుంటూ "ఏందే జలా, బగ్గ తయారైనవ్. ఏరాజు కొడుకన్నా ఎత్తుకపోతడే..." అంటూ నవ్వింది.

అందుకు జలజ అందరివైపూ కఠినంగా చూస్తూ "మేం మాదిగోల్లమమ్మా...మమ్ముల్ని ఏ రాక్షసుడు ముట్టడు. రాజకుమారుడూ ముట్టడు" అంది కట్టె విరిచినట్టు.

"బహుశా అప్పుడు తనకు పన్నెండేండ్లుంటాయేమో. తన సోపతోల్లందరి మధ్య కనిపించని అగాధాలేవో గాఢంగా, స్పష్టంగా కనిపించినట్లయింది. ఏ రాక్షసులూ, రాజకుమారులూ ముట్టని ఆ పిల్ల మాటలు అతన్ని చాలా ఏళ్ళ వెంటాడాయి. వాటిని తెలుసుకునే క్రమంలో సమ్మయ్య అన్వేషణ చాలా దూరమే సాగింది.

ఆ అడవి, గుట్టలు, జలజ, తనకు మధ్య ఏదో గట్టి అవినాభావ సంబంధమేదో ఉన్నట్లనిపించేది అతనికి. పచ్చదనంతో పూల పరిమళాల్లో నవనవలాడే గుట్టలను చూసినప్పుడల్లా అతని మనసులో జలజే మెదులుతుంది. గుట్టలే జలజ. జలజే ఆ గుట్టలు అనుకునేవాడు. కలలు కనేవాడు.

** ** **

అట్లాంటి జలజ ప్రస్తుతం ఊరికి సర్పంచ్!



పెళ్లయ్యాక మొగుడితో గోదావరిఖనిలో ఉన్న అత్తగారింటికి పోయి ఉంది. కానీ అక్కడ అత్తామామలతో సరిపడక మొగుడ్ని వెంటేసుకుని తిరిగి ఊరు చేరింది. భర్త చేసే పనేం లేదు. రోజూ గోదావరిఖని పోయి అక్కడి చోటా, మోటా లీడర్లతో రాసుకు పూసుకు తిరగడం...దావత్‌లకు మరగడం!

సర్పంచ్ పదవిని రోస్టర్ ప్రకారం ఎస్సీ మహిళలకు కేటాయించడంతో భర్త బలవంతం మీద జలజ పోటీ చేసింది. ఓట్లకోసం ఇంటింటికి తిరిగింది. ఆమె భర్త లింగయ్య చేసిన ఆర్భాటం అంతా ఇంతా కాదు. అన్నీ తానే అయి వ్యవహరించాడు. చివరికి సర్పంచ్‌గా ఎన్నికయింది. ఊరు గ్రామపంచాయితీగా మారినప్పటి నుండి సర్పంచ్‌గా ఉన్న భాస్కర్‌రావు దొర పక్కకు తొలగాల్సి వచ్చింది.

“ఆ జెల్ల, ఈ జలజ ఒక్కరేనా...?” అని ఆమెను చూసినప్పుడల్లా ఆశ్చర్యపోతుంటాడు సమ్మయ్య.

“ఊరికి కొత్త కళ వచ్చిన మాట నిజమే. అంతగా అవసరం లేకున్నా అతి విశాలమైన బైపాస్ రోడ్ వచ్చింది. సిమెంటు రోడ్లు, పనికి ఆహార పథకం కింద రకరకాల పనులు, డ్రైనేజీలు, స్కూలు బిల్డింగ్..కానీ ఇవన్నీ పీనుగుకు చేసే అలంకరణల్లాగే అనిపించేవి. ఊర్లో జీవం ఉన్నట్లనిపించేది కాదు. ఊరు చావు చాలా ఏళ్ల కిందటి నుండే మొదలయింది” అనుకున్నాడు సమ్మయ్య. జలజభర్త లింగయ్య త్వరలోనే ఒక మోటార్‌బైక్, గోదావరిఖనిలో చిన్న ఇల్లు కొన్నాడు. కడక్ మీదుండే ఖద్దరు బట్టలు తొడుగుతున్నాడు. అతనిప్పుడు పూర్తిగా బిజీ. పోలీసు కేసులు...పనుల పైరవీలు.

సమ్మయ్య పాత జ్ఞాపకాలతో, రకరకాల ఆలోచనలతో కొట్టుమిట్టాడుతుండగనే అతని తల్లి గంగు వచ్చింది. మక్కంకుల సంచిని, నేలపైన పడవేసింది. సమ్మయ్య తన ఆలోచనల్నుండి బయట పడ్డాడు.

** ** **

**మారుతీ ఎస్టీమ్ కారు సమ్మయ్య హోటల్ పక్కగా వెళుతూ క్రషర్ల దగ్గర ఆగింది. అందులోంచి సాదాసీదాగా ఉన్న జలజ, కడక్ ఖద్దరు బట్టల లింగయ్య, మాజీ సర్పంచ్ భాస్కర్‌రావు కొడుకు రమేశ్‌రావు దిగారు. కంకుల్ని కాలుస్తూ వాళ్లను చూస్తున్న గంగు, కొడుకుతో “లింగడు ఎంత ఇకమతులున్నోడురా? సూస్తుండగనే పైకచ్చిండు. కొంచెం అటూ ఇటూ గాని చిన్నదొర లెక్కనే ఉన్నడు గదరా” అంది.**

“ఏందే అవ్వా! గింత సేపయింది?” అని అడిగిండు.

ఆమె ఏం మాట్లాడలేదు. తట్టు సంచి పరిచి కూర్చుని బొగ్గుల తట్టను సర్దుకుంది. నిప్పు రాజేసి విసన కర్రతో విసరడం మొదలుపెట్టింది. అది బొగ్గులను మండించడానికి కాకుండా తనలోని మంటల్ని ఆర్పడానికి ఊపుతున్నట్లుగా ఉంది. ఆగింది.

“పిస ఎల్లి జరిగిపోయిందిరా” అన్నది. ముక్కు చీదుతూ. పిడుగుపడ్డట్టయ్యింది సమ్మయ్యకు “అయ్యోపాపం” అన్నాడు. చావు వార్తతో ఎంతో అలసట పడిపోయాడు. కొంచెం తేరుకొని “అసలేమైందే?” అని అడిగిండు.

“సలికి గడ్డకట్టుకపోయి సచ్చిందిరా. రోడ్డ పక్కపొంటి పాల సముద్రం సెట్లల్ల ఉంది పీనుగు. ఊరు ఊరంతా అక్కడ్నే ఉంది” అంది దుఃఖంతో భారతమైన గొంతును పెగుల్చుకుంటూ.

“అవ్వా! నువ్వు కొంచెం హోటల్ జూసుకోయె...” అంటూ ఉరుకుతున్నట్లే పోయిండు.

హైవే పక్కనున్న పాలసముద్రం చెట్ల మధ్య వెల్లకిలా పడి ఉంది పిస ఎల్లి. పెయ్యంతా దెబ్బలున్నాయి. మోకాళ్లు, మోచేతులు ఒరుసుకొనిపోయి ఉంది.

గుంపుగా చేరిన జనం తలోకమాట అంటున్నారు. ఎడమ దండ కుండాల్సిన వెండి కడియం లేదు. దాని కోసమే ఎవరో కొట్టి చంపేసారని కొందరు, ఏ లారో, జీపో గుద్ది పడిపోయి ఉంటుందని కొందరు చలికి చచ్చిపోయిందని మరికొందరు. ఇంతలో జలజ భర్త లింగయ్య వచ్చిండు. అటూ ఇటూ కలియ తిరిగిండు.

“ఊర్లె ఎవలు సచ్చినా నాకు సచ్చే సావయితున్నది. సచ్చింది పిసది. పెయ్యిమీద దెబ్బలున్నయి. యాక్సిడెంటో, హత్యనో అందామంటే ఎస్సై సాబ్ మీది మీదికి ఎగురుతడు. ఇప్పటికే మండలంల క్రైంరేట్ పెరుగుతున్నదని మీదోళ్లు అంటున్నరని ఆసారు బాధ. ఇంక పంచనామా, పోస్టుమార్టం అంటరు. ఎక్కడికి వోయినా పైసలిచ్చుడు తప్పదాయె. ఎట్లనో సచ్చింది. దాన్ని పంపిచ్చుడన్నా ప్రశాంతంగా పంపిద్దాం. పోలీసోల్లకు చెప్పితే ఒక బాధ. చెప్పకపోతే ఒక బాధ...” అన్నాడు లింగయ్య.

లోగొంతుతో తనలో తానే మాట్లాడుతున్నట్లు “ముందు ఎనక అనకుంట మంది బొందల మీద పైసలు కుమ్మరిస్తనా...అయినా గాని అందరు నా మీదనే మిడుకుతరు” అంటూ గులిగిండు.

అతని మాటల్ని, గులుగుడును విన్నాడు సమ్మయ్య. సమ్మయ్య పక్కన ఎప్పుడో వచ్చి నిలబడి ఉన్న పోచయ్య గుసగుసలాడిండు.

“దానకర్ణునిలెక్క పైసలు దానం చేస్తున్నట్లు చెపుతున్నడు చూడు. నరం లేని నాలిక...మొన్న మన ఊరి పిలగాడు రైలు పట్టాల మీద సచ్చిపోలేదా? ఆడు ఓ మార్వాడోల్ల పోరి తోటి తిరిగెటోడని చివరికి ఆ పోరి కాదన్నదని రైలు కిందపడి సచ్చిపోయిండని మనం అనుకున్నం గదా. కాదు ఆ రోజు రాత్రి పట్టాలకాడ వాళ్ల తెల్లటి కారు తిరిగిందంట. అక్కడోల్లు అనుకుంటె విన్న. ఆ పోరడు లింగయ్య కులపోడే కదా. లింగనితోటి పోలీసోల్లు పోరని తల్లిదండ్రులకు కొన్ని పైసలు ఇప్పిచ్చిన్రు. ఆళ్లను బతిలాడి, బెదిరించి ఊర్లెకెలి పోవుటానికి ఒప్పిచ్చిన్రు. కులసంఘపోల్లు లొల్లి వెట్టకుంట పైసలు జల్లిన్రు. ఆ కిస్సాల లింగడు గూడా మస్తు నొక్కిండని అనుకుంటున్నరు. పేపరోల్లను కూడా పట్టేసిన్రు” అన్నాడు పోచయ్య సమ్మయ్యతో ఎవరికీ వినిపించని గొంతుతోటి.

“పైసలున్నోల్లు ఎన్ని పాపపు పనులు జేసినా చెల్లుతదే పోశన్న” అన్నాడు సమ్మయ్య.

మళ్లీ కొంత విరామం తరువాత...

“కులం పేరుమీద పైకచ్చినోల్లు పైసలున్నోల్లకు గులాం అవుతున్రే” అన్నాడు సమ్మయ్య.

అక్కడికక్కడనే మనిషికి కొన్ని పైసలు వేసుకుని ఎల్లికి అంత్యక్రియలు జరిపారు. ఊర్లో జరిగిన ఈ చావూ సమ్మయ్యను కలవర పెడుతూనే ఉంది.

** ** **

మారుతీ ఎస్టీమ్ కారు సమ్మయ్య హోటల్ పక్కగా వెళుతూ క్రషర్ల దగ్గర ఆగింది. అందులోంచి సాదాసీదాగా ఉన్న జలజ, కడక్ ఖద్దరు బట్టల లింగయ్య, మాజీ సర్పంచ్ భాస్కర్

రావు కొడుకు రమేశ్‌రావు దిగారు. కంకుల్ని కాలుస్తూ వాళ్లను చూస్తున్న గంగు, కొడుకుతో "లింగడు ఎంత ఇకమతులున్నోడురా? సూస్తుండగనే పైకచ్చిండు. కొంచెం అటూ ఇటూ గాని చిన్నదొర లెక్కనే ఉన్నడు గదరా" అంది.

సమ్మయ్య వాళ్లకేసి చూసిండు. చప్పున గుర్తొచ్చింది. "జనంసొమ్ము మింగుట్ల భాస్కర్‌రావు దొరకు, లింగయ్యకు తేడా లేదు. ఉన్న ఫరకల్లా దొర సర్పంచ్‌గా ఉన్న కాలంల దొరతనం చాటున ఎవలకు తెల్వకుంట జనం సొమ్ము మింగుతుండె. ఈ లింగనికి ఇంక ఆ తెల్వితేటలు అబ్బలే. అయినా ఈ కొత్త దొరతో ఆ పాత దొర వియ్యమందగలడా" అని జాలిపడ్డాడు.

"సమ్మయ్య తల్లి విసనకర్ర ఆపకుండా ఊపుతూనే "అయినా దొర దొరేరా. ఎంతైనా భాస్కర్‌రావు దొరది భారీ గుణం. గీ లింగని పెండ్లాం సర్పంచ్ అయినా మాదిగ బుద్దులు పోలే. పైసకు పియ్యి దింటడు" అంది.

అందుకు సమ్మయ్య "మంది సొమ్ము దినుట్ల ఇద్దరూ ఒకంతేలేవే అవ్వా! పెద్ద కులపోడు చేస్తే ధైర్యం, కింది కులపోల్లు చేస్తే మాదిగబుద్ధి. ఇవన్నీ తప్పే. ఆళ్లు మంది సొమ్ము మింగే దాంట్ల ఒక బొక్క ఇటిసిరేస్తే భారీ గుణమానే. మందిని ముంచనోడు తనది కాని సొమ్ము ముట్టనోడు గొప్పోడు. ఎవడైతేంది" అన్నాడు.

అంతదూరం నుండే వాళ్లు చప్పట్లు గొట్టి సమ్మయ్యకేసి మూడు వేళ్ళు చూపించారు మూడు చాయలు దెమ్మన్నట్లు. సమ్మయ్య చాయజేసి కెటిల్లో పట్టుకొనిపోయి గ్లాసుల్లో పోసి ఇచ్చాడు. జలజ అతన్ని చూసి పలకరింపుగా నవ్వింది. ఆమెతో కలిసి, ఆ గుట్ట సమీపంలో ఉండడం సమ్మయ్యకు దుర్భరంగా ఉంది.

పచ్చదనం సమస్తం హరించుకుపోయి ఛిద్రమైన గుట్ట.

వాళ్ళు తాగిన గ్లాసుల్ని తీసుకుని వెలుతుంటె లింగయ్య "సమ్మన్నా! ఒక్క మాట. ఈ వారం రోజులు చిన్న పోరగాండ్లను పనిలకు రావద్దన్నం గని...నువ్వు గూడా ఓ కన్నేసి ఉంచు. సదువుల పండుగని సార్లు తిరుగుతున్రు" అన్నాడు.

సమ్మయ్య హోటల్‌కు వచ్చి గ్లాసులు కడిగాడు. అక్కడి నుండి జలజను, ఆ గుట్టలను చూస్తుండిపోయాడు.

** ** **

చలికాలం తన ప్రతాపాన్ని చూపిస్తూనే ఉంది. రోజురోజుకి చలి పెరుగుతున్నదే గానీ తగ్గడం లేదు. సమ్మయ్య చీకటి పడుతుండగా మిగిలిన టిఫిన్ సామాన్లని సంచిలో వేసుకున్నాడు. సంచిని సైకిలుకు కట్టుకుని ఇంటివైపు మెల్లగా తొక్కుకుంటూ వెలుతున్నాడు. గ్రామ పంచాయతి కార్యాలయం దగ్గర సఫాయి నర్సయ్య సైకిల్ ఆపిండు.

"సమ్మన్నా నిన్ను సర్పంచ్ రమ్మన్నడే" అన్నాడు. సర్పంచ్ జలజ అయితే అందరూ లింగయ్యనే సర్పంచ్ అంటున్నారు.

"ఎందుకు రమ్మన్నడు నన్ను" అడిగిండు సమ్మయ్య.

"రేపు జన్మభూమికదా. సార్లస్తున్నరు. వాళ్ల తిండీ తిప్పల గురించి నీకేదో చెప్తరట" అన్నాడు నర్సయ్య.

"ఇప్పుడెక్కడ ఉన్నాడు లింగయ్య?" అడిగిండు సమ్మయ్య.

"ఇప్పటిదాక ఇక్కడనే ఉండే. గిప్పుడే పోయిండు. లోపల జలజమ్మ ఉంది" అన్నాడతను. గ్రామ పంచాయతి ఆఫీసు లోపలికి వెళ్లిండు సమ్మయ్య. ఆమె ముందరున్న కుర్చీలో కూర్చున్నాడు. సాధారణంగా జలజ అక్కడ ఎంతో అవసరమైతే తప్ప ఉండదు.

**అంతదూరం నుండే వాళ్లు చప్పట్లు గొట్టి సమ్మయ్యకేసి మూడు వేళ్ళు చూపించారు మూడు చాయలు దెమ్మన్నట్లు. సమ్మయ్య చాయజేసి కెటిల్లో పట్టుకొనిపోయి గ్లాసుల్లో పోసి ఇచ్చాడు. జలజ అతన్ని చూసి పలకరింపుగా నవ్వింది. ఆమెతో కలిసి, ఆ గుట్ట సమీపంలో ఉండడం సమ్మయ్యకు దుర్భరంగాఉంది.**

"హోటల్ ఎట్ల నడుస్తున్నది?" ప్రశ్నించింది జలజ.

"మంచిగనే నడుస్తున్నది" జవాబిచ్చిండు సమ్మయ్య.

ఇంతలో అక్కడికి లింగయ్య ఎంపిటీసి గట్టయ్య వచ్చిన్రు.


గట్టయ్య వస్తూనే..."అక్కా! అంతా మీదే హవా నడుస్తున్నది" అన్నడు అవసరం లేకున్నా నవ్వుతూ.

"మాదే అంటే...?" అడిగింది జలజ.

"మీ ఎస్సీలదే! ఈ ఊరి సర్పంచ్ గిరీ ఎస్సీదేనా. మండలాధ్యక్షుడు ఎస్సీ. ఎమ్మెల్యే ఎస్సీ. ఎంపీ ఎస్సీ మహిళేనా. చివరకు మన రామగుండం మున్సిపల్ చైర్మన్ పదవి గూడా ఎస్సీకి కేటాయించిన్రట" అన్నాడు నవ్వుతూ.

జలజ ముఖం కఠినంగా మారింది "మీ ఓ.సీ.లు, బీ.సీ.లు ఇన్ని రోజులు మమ్మల్ని తొక్కింది చాలదా? కొంచెం అవకాశాలు కల్పిస్తే కుళ్లుకొని ఏడ్చి చస్తరెందుకు?" అంది.

గట్టయ్య ముఖంల నవ్వు మాయమయింది. ఏదో వివరణ ఇస్తున్న ధోరణిలో- "అది గాదక్క గిన్ని రోజుల్నుంచి చైర్మన్ పదవి మీద ఆశ



పెట్టుకుని మన రాజిరెడ్డన్న ఎంత కష్టపడ్డడు. ఎన్ని పైసలు పెట్టుకున్నడు. ఎక్కడ మీటింగైనా ఎంత మందిని జమజేస్తుండే. గిట్ల అచానక్ చైర్మన్ పదవి ఎస్సీకేనంటె గసోంటోల్ల బతుకులు ఏం గావాలె?" అన్నాడు.

"ఆ...చేసిందులే దేశసేవ" అన్నది అతని మాటల్ని తీసిపారేస్తూ.

"నీ సంగతి తెలిసిగూడా మాట్లాడిన. సాలక్కా సాలు...నన్నిడిసిపెట్టు" అన్నాడు గట్టయ్య.

అవీ, ఇవీ, మాట్లాడి వెళ్ళిపోయిండు గట్టయ్య. ఇక తన సంగతి తేల్చేస్తే వెళ్ళిపోదామని చూస్తున్నాడు సమ్మయ్య.

"సమ్మన్నా! నువ్వు జెప్పు. మేం బాగుపడుతుంటే అందరికి ఎందుకు కండ్లమంట. పెద్దోళ్ళ పొలాలల్ల మేం తాలుగింజలు ఏరుకున్న రోజులు మరిచిపోయిన్రా..." అన్నాడు లింగయ్య.

సమ్మయ్య ఏం మాట్లాడలేదు.

"చెప్పు సమ్మన్నా చెప్పు... అంటూ భుజాలు గట్టిగా వూపిండు. కొంచెం వాసనేసింది. మనిషి మాంచి నిషా మీదున్నడు" అనుకున్నాడు సమ్మయ్య.

వద్దు వద్దనుకుంటూనే నోరు విప్పిండు. సమ్మయ్య "నువ్వు చెప్పినదానికంటె ఇంక ఎక్కువనే మీ తండ్రులు, తాతలు కష్టపడ్డరు లింగన్నా. నిజమే! ఒక మనిషి ఇంకో మనిషిని తొక్కనిదెప్పుడు? ఆంధ్రా, తెలంగాణాను పెద్ద కులపోల్లు చిన్న కులపోల్లను, మొగోల్లు ఆడోల్లను... గిట్ల జరుగతనే ఉన్నది నిజమే. కానీ గీ రోగాలకు మందు రిజర్వేషన్లు మాత్రమే గాదు. ఇవి దెబ్బ తగిలి పుండయి సలుపుతున్నప్పుడు ఇచ్చే నొప్పితగ్గే గోలీల్లాంటియి. కానీ నొప్పి తగ్గుడే కాదు. గదా! పుండు తగ్గాలే. అందుకు గావలసింది ఆంటి బయాటిక్!" అన్నాడు సమ్మయ్య.

"అంటే...?" తికమకతో అడిగిండు లింగయ్య.

"రిజర్వేషన్లు వద్దంటావ్" తిరిగి అన్నాడతను సమ్మయ్యను ద్వేషంగా చూస్తూ.

"వద్దనలే. ఇది మాత్రమే మందు గాదు. నొప్పి తగ్గుడే గాదు పుండు తగ్గాలే అంటున్నా. పోనీ అది చెప్పు. మన నియోజకవర్గానికి సంబంధించి అందరు ఎస్సీల్లో, ఎస్టీల్లో, ఆడవాళ్లో ఉన్నారనుకో. అయితే మాత్రం...? పాత దొరలు పోయి కొత్త దొరలు లేదా పాత దొరలతోపాటు కొత్త దొరలు... నేను కోరుకునేదయితే మల్లా అంతా మొదలు కావాలె. ఎవని కష్టం తిని వాడు బతకాలే. గంతే! మంది కష్టం తినుటానికి మొగోడేంది, ఆడదేంది, పెద్ద కులపోడేంది, చిన్న కులపోడేంది! ఇదెట్లుందంటే గిన్ని దినాలు వాడు మింగిండు. ఇప్పుడు మేం మింగాలి. గంతే. కానీ కావల్సిందేమిటంటే తన కష్టార్జితం కాని సొమ్మును మింగే అవకాశం లేని పరిస్థితి..." అంటూ లేచిండు సమ్మయ్య.

బయటకు వెళ్లబోతూ జలజవైపు చూసిండు సమ్మయ్య. ఆమెను చూస్తుంటే సిదలు సిదలైన గుట్ట యాదికచ్చింది అతనికి.